ప్రశ్న నిమిత

# తాతయ్యకి , ప్రేమతో...



## నెలనెలా సందేశాల సందోహాలు

ఒకప్పుడు, నేను చిన్నప్పుడు, నన్ను నేను తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నప్పుడు, ప్రపంచమంతా తెలీని అంధకారంలోనుండి భయపెడుతున్నప్పుడు, అర్థం కాని అపాయాలు వరదల్లా ముంచెత్తినప్పుడు, తన భుజాలమీద ఎక్కించుకొని భద్రంగా దాటించి గమ్యం చేర్చిన తాతయ్య. పొలం గట్టున నాతో పాటూ పరిగెత్తిన తాతయ్య, గంట సేపు నేను కనపడలేదని హడలిపోయిన తాతయ్య, సంతకు వెళ్ళిన ప్రతిసారీ నాకిష్టమని జిలేబి తెచ్చిన తాతయ్య, నిర్మలమైన ప్రేమకు నిర్వచనమిచ్చిన తాతయ్య. నాతో కలిసి పుస్తకాలు చదివిన తాతయ్య. జనవరిలో వస్తున్నానంటే 'చాలా సంతోషం అమ్మా' అన్న తాతయ్య. ఏమైపోయావు, మమ్మల్నందర్నీ వదిలేసి ఎక్కడకు వెళ్ళిపోయావు? మరీ ముఖ్యంగా నాతో మాటమాత్రమైనా చెప్పకుండా వెళ్ళడానికి మనసెలా ఒప్పింది నీకు? ఇన్ని సంవత్సరాల స్నేహానికిదేనా అర్థం? అదిగో చూడు, నేనూ మామూలు మనిషినే. నీకోసం కాక నువ్వు నాకు చెప్పకుండా వెళ్ళిపోయావన్న ప్రశ్నకే ప్రాధాన్యతనిస్తున్నా. మేమంతేలే, ఇక్కడ ఉన్న వాళ్ళమింకా అలాగే ఆలోచిస్తాం, నీకు తెలీనిదేముంది? ఉనికిని నియంత్రించే ధర్మాలని కాలదన్నే జ్ఞానం లేదు కదా మాకు? కానీ నీ విషయం వేరు. ఉన్నన్నాళ్ళూ నీకోసం ఆలోచించుకోక మా అందరికోసం బ్రతికిన నువ్వు, మరణాన్నీ అంతే నిశ్శబ్దంగా, నిరాడంబరంగా అంగీకరించావు.

నీకోసం ప్రజలు నివాళులర్పించలేదు, నీ జ్ఞాపకార్థం ప్రభుత్వం ఎలాంటి స్తూపమూ నిర్మించలేదు, నిన్ను గౌరవిస్తూ పాఠశాలలు మౌనం పాటించలేదు. అలాగని నువ్వు నెహ్రూ కన్నా గొప్పవాడివి కావని కాదు, గాంధీ కన్నా మంచివాడివి కాదనీ కాదు. వీటన్నింటికన్నా ముఖ్యమైన విషయం నువ్వింక లేవని తెలిసినప్పుడు బరువెక్కిన గుండెలే కానీ, విరుపు మాటలు లేవన్నది. బంగారం లాంటి హృదయమున్న నీలాంటి వాళ్ళుండబట్టే మన సమాజమిలా మనగల్గింది, వాళ్ళ లాంటి నేతలు మీ బుజాల మీద నిలబడ గలిగారు. మీ తరం ఆదర్శాల పాళ్ళలో పదోవంతు మాకు సంక్రమించినా మన సమాజం భవిష్యత్‌కి లోటు లేదు. అలాంటి విలువల్ని మాకు నేర్ప ప్రయత్నించిన మీ అందరికీ ఈ వందకోట్ల జనాభా తరుపున, ఆప్యాయతకి అర్థం చెప్పిన నీ జ్ఞాపకాలకి నా తరుపున, మౌనభాష్పాల కుసుమాంజలి.

నాకు తెలుసు. నియమాల ప్రకారం, రచయిత్రిగా నా జీవితంలో సంఘటనలతో మీకు ఎలాంటి సంబంధం లేదు. కానీ ఈ ఒక్క ముఖ్యమైన సంఘటన మాత్రం మీ అందరితో పంచుకోవాలనిపించింది. ఒకప్పుడు ఇలాంటి నివాళులు చదివినప్పుడు నాకు చాలా వింతగా అనిపిస్తుండేది. ఎందుకిలా ప్రపంచానికి తెలిసేంతగా పత్రికల్లో ప్రకటించడం, ఎవరేం ఖాతరు చేస్తారని? అని అనుకొనేదాన్ని. కానీ ఇప్పుడర్థమౌతుంది ఆ ప్రయత్నాల వెనుక తాపత్రయమేమిటో. ఎప్పుడైనా ఒంటరిగా ఉన్నప్పుడు అందమైన సూర్యాస్తమయమో లేక చంద్రోదయమో చూసినప్పుడో, లేక ఓ అద్భుతమైన కవిత చదివినప్పుడో, ఆ ఆలోచన, అనుభూతి వెంటనే ఎవరితోనో పంచుకోవాలనిపిస్తుందే, అలాంటిదే ఈ ప్రయత్నమూనూ. మీలో చాలామంది ఇలాంటి సంఘటన ఎదుర్కొని ఉంటారు. ముఖ్యంగా మరణం కలిగించే అవ్యక్త అవేదనల్ని అర్థం చేసుకోడానికి చాలా సమయం పడుతుంది. అందుకే ఆ భావాన్ని అంతకు ముందు చవిచూసిన వాళ్ళతో పంచుకోవాలన్న తపన. మనిషి సంఘజీవి అన్నదానికి ఇది చాలా సరైన ఉదాహరణేమో?